తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

శనివారం
14 నవంబర్ 2026

పేజీలు : 08

Follow :



రంగనాథ్ హాజరుపై డీజీపీకి బాధ్యత

హైదరాబాద్ శివారులోని లోతుకుంట భూ వివాదంలో కోర్టు స్టే ఉన్నప్పటికీ కూల్చివేతలు చేపట్టారన్న ఆరోపణలపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలన్న ఆదేశాలను పాటించకపోవడంపై అసహనం వ్యక్తం చేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను తోసిపుచ్చింది. రంగనాథ్ కోర్టుకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యతను రాష్ట్ర డీజీపీకి అప్పగించింది. ఇదే కేసులో విచారణకు హాజరుకావాల్సిన శంషాబాద్ తహసీల్దార్‌కు కూడా మినహాయింపు ఇచ్చేందుకు నిరాకరించింది. ఆయనను కోర్టు ఎదుట హాజరుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులను ఆదేశించింది.

రంగారెడ్డి కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత ఆస్తుల జాబితా నుంచి కొన్ని భూములను తొలగించాలంటూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలని 2025 ఆగస్టులో హైకోర్టు ఆదేశించింది. అయితే కలెక్టర్ నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కలెక్టర్ సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లోని వివరాలు, అధికారిక రికార్డులకు భిన్నంగా ఉన్నాయని న్యాయస్థానం గుర్తించింది. ఆర్డీవో, తహసీల్దార్ల నివేదికలు తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకున్నామని కలెక్టర్ పేర్కొన్నప్పటికీ, విచారణ ప్రొసీడింగ్స్‌లో సంబంధిత అధికారుల సంతకాలు భాళీగా ఉండటాన్ని కోర్టు ప్రస్తావించింది. అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. నాలుగు సర్వే నంబర్లలో ఒకదానిని నిషేధిత జాబితా నుంచి తొలగించి, మిగిలిన భూములపై ఆంక్షలు కొనసాగించడంలో అధికారుల ద్వంద్వ వైఖరిని తప్పబట్టింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడానికి తగిన సమయం ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారని నిర్ధారిస్తూ జస్టిస్ లక్ష్మణ్ ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాలపాటు నిలిపివేశారు.

కోర్టు బోనులో కలెక్టర్లు..!





- మొన్న రంగారెడ్డి కలెక్టర్.. నిన్న మేడ్చల్ కలెక్టర్ కు నోటీసులు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హాజరుపై డీజీపీకి హైకోర్టు ఆదేశాలు
- కలెక్టర్ల నుంచి కమిషనర్ల దాకా కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తే జైలు శిక్షలే..



న్యాయస్థానాల ఆదేశాల అమలులో ఉన్నతాధికాల నిర్లక్ష్యం

ధర్మాసనం ఆగ్రహంతో సామాన్యులకు దక్కే న్యాయంపై అనేక ప్రశ్నలు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :

రాజ్యాంగబద్ధమైన అత్యున్నత హోదాల్లో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు న్యాయస్థానాల ఆదేశాల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? కోర్టులు పలుమార్లు ఆదేశించినా స్పందించకపోవడం, గడువులోగా నిర్ణయాలు తీసుకోకపోవడం, విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకపోవడం వంటి పరిణామాలపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందిస్తోంది. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఉన్నతాధికారులకు జైలు శిక్షలు విధించడం, మరికొందరిని పోలీసుల ద్వారా న్యాయస్థానం ఎదుట హాజరుపరచాలని ఆదేశించడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించగా, తాజాగా మేడ్చల్ జిల్లా కలెక్టర్‌ను కోర్టుకు తీసుకురావాలని, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ విచారణకు హాజరయ్యేలా చూడాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది.

మేడ్చల్ కలెక్టర్‌ను కోర్టుకు తీసుకురావాలని ఆదేశం

ప్రభుత్వ భూములు, సీలింగ్ మిగులు భూముల స్వాధీనానికి సంబంధించిన వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు కోర్టు ఆదేశాల అమలులో జాప్యం చేస్తున్నారంటూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పలుమార్లు ఆదేశించినప్పటికీ విచారణకు హాజరుకాకపోవడాన్ని తప్పబట్టింది. జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం కలెక్టర్‌ను కోర్టు ఎదుట హాజరుపరచాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది.

గతంలోనూ పలువురు అధికారులకు నోటీసులు, వారెంట్లు

భూసేకరణ పరిహారం, భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో గతంలోనూ పలువురు ఐఏఎస్ అధికారులు కోర్టు ధిక్కరణ వ్యవహారాలను ఎదుర్కొన్నారు. వికాస్‌రాజ్, యోగితారాణి, అమోయ్‌కుమార్, లోకేశ్‌కుమార్, జేఎస్ రంజన్ తదితర అధికారుల పేర్లు ఈ వ్యవహారాల్లో ప్రస్తావనకు వచ్చాయి. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా సహా పలువురిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ అయిన సందర్భాలున్నాయి. బాచుపల్లి భూ వివాదంలో సబ్‌రిజిస్ట్రార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులకు హైకోర్టు జైలు శిక్ష విధించింది. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు ప్రభుత్వ ఉన్నతాధికారుల్లో కలకలం రేపుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారైనా న్యాయస్థానాల ఆదేశాలకు లోబడి వ్యవహరించాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో, కోర్టు ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులకు కఠిన పరిణామాలు తప్పవన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

పేదల సమస్యలు పట్టనివారిలో మార్పు రావాలి



: ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల నేత

రైతులు, పేద ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల పద్దకు వెళ్తున్నా స్పందించే పరిస్థితి కనిపించడం లేదు. తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోరుతూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సామాన్యులను పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారుల వ్యవస్థలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. న్యాయస్థానాల ఇలాంటి తీర్పుల ద్వారా పేదలకు కూడా న్యాయం జరుగుతుందనే నమ్మకం కలగాలి.

అధికారులను జైలుకు పంపిస్తేనే మార్పు



: జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ న్యాయమూర్తి

హైకోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్నా చర్యలు తప్పవు. ఇప్పటికే పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వ్యవహారశైలిపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పెన్షనర్లు, రైతులు, సామాన్య ప్రజలు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో కోర్టు ధిక్కరణ కేసులు వస్తున్నాయి. ఆదేశాలను పట్టించుకోని అధికారులకు ఒకసారి జైలు శిక్ష విధిస్తేనే వ్యవస్థలో మార్పు వస్తుంది.

ప్రభుత్వాల అండతోనే కోర్టు ధిక్కరణ



: వి. రఘునాథ్, బార్ కౌన్సిల్ సభ్యుడు, హైకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది

ప్రభుత్వాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కొందరు అధికారులు హైకోర్టు తీర్పులను బేఖాతరు చేస్తూ కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారు. జిల్లా కలెక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వాల అండతోనే న్యాయస్థానాల ఆదేశాలను పట్టించుకోవడం లేదు. ఇలాంటి చర్యలతో సామాన్య ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. సామాన్యులు కోర్టు ధిక్కరణకు పాల్పడితే న్యాయస్థానాలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయో, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న అధికారులపైనా అలాంటి చర్యలే తీసుకోవాలి.